కవితా కౌముది

శుభకృతు నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
27 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

## ఈ రాత్రికి సౌత్ ఆఫ్రికా

- గౌతమ్ లింగా - (Johannesburg, South Africa)

ఈ రాత్రి సౌతాఫ్రికా...

పాలపుంతల అగాధాల్లోంచి రాలిపడ్డ వజ్రపు ముక్క

తెల్లటి కాకులతో కొట్లాడి

ఆకాశంలో హరివిల్లు జెండా ఎగరేసిన నల్లటి హంస

భూమి చెట్టుకి తల్లివేరై

రెండు సంద్రపు కొండల మధ్యనుంచి ఉదయించిన చీకటి సూర్యుడి కథ

మొదటిమనిషిని కడుపున కన్న అమ్మ చీరకొంగు

ఆవలొడ్డు తిమింగలాల పదునుకోరల్లోంచి తప్పించుకొని

తీరానికి కొట్టుకొచ్చిన ముత్యపు కెరటం

డర్బన్ Addington Beach ఇసుకలో

చెమటచుక్కల వంతెనలు కట్టడానికి దేశాలు దాటి వచ్చిన

తమ్ముళ్ల పాదాల గుర్తులు

ప్రజాస్వామ్యపు ఇంటి కప్పు కింద

ఆరుకోట్ల బిడ్డల ఆకలిని రెండు పూటలా తీరుస్తున్న

మూడు పొదుగుల ఆవు

Vilakazi వీధి ఎగరేసిన రెండు శాంతి కపోతాల రెక్కల చప్పుడు

ఎఱ్ఱటి ఎండకి వక్కిపోయి

Eastern Cape రొమ్ముల్లోంచి బొట్లుబొట్లుగా కారుతున్న పాలచుక్క

జూలూ నల్లపిల్ల కొండల్నీ కోనల్నీ దాటొచ్చి

Sandton వీధుల్లో ఎత్తి పట్టుకున్న అక్షర కాగడా

కేప్ టౌన్ లాంగ్ స్ట్రీట్ పబ్బుల్లో

అర్ధరాత్రి సగం దేహాన్ని కప్పుకున్న నైలాన్ బట్టలమీద నియాన్ లైట్లు కురిసిన వెలుతురు వాన

నీ చూపులతో అంతెత్తు పైనెక్కడో ఎగురుతూ

విమానం లెన్స్ తో టేబుల్ మౌంటెన్ చుట్టూ చూస్తావ్ చూడు

అది కాదిది

పక్కనే రాబిన్ ఐలాండ్ జైలు కిటికీ కళ్ళలోంచి చూస్తూ

నెల్సన్ మండేలా అరచేతుల్లోకి తీసుకొని ఓదార్చిన పసిపాప నా సౌతాఫ్రికా

## ఏమంటేనేం?

స్వాతీ శ్రీపాద (Detroit,MI)

నేను నేను కాదు

నువ్వూ నువ్వు కాదు.

ఎప్పటికప్పుడు కుబుసాలు వదిలేస్తూ

కొత్త రూపాలు సంతరించుకునే నువ్వూ నేనూ మనం

కాలానికి ప్రతిబింబాలం తప్ప నువ్వూ నేనూ మనం కాదు.

లేలేత గులాబీ రేకుల పాదాల అలికిడి

సౌకుమార్యం రూపు దిద్దుకున్న అరచేతుల మెత్తదనం

పురాసుకృత మౌనాన్ని పెకలించుకు వెంట తెచ్చుకున్న వేళ

నువ్వూ నేనూ మనం ఎవరికి ఎవరమో ఎవరికి తెలుసు

చిగుర్లుగా కొమ్మలుగా పెరిగి

ఉన్నట్టుండి మొగ్గలు తొడిగిన యౌవనం

దారి దారంతా పూల సందడులు మోసుకువచ్చే వసంతమై

తీగల్లేని అనుబంధాల వంతెనలు వేస్తూ

నిన్నూ నన్నూ మనందరినీ అనుసంధానించే మార్గాన

అత్తరు సువాసనల అనురాగాలు వర్షిస్తూ

ఒకరికొకరై నువ్వూ నేనూ మనందరం

ఆగి వయసు చాటున మాటు వేసిన

ఆకు రాలు సమయం ఉన్నట్టుండి పంజా విసిరే

క్షణాలకు కకావికలై చెల్లా చెదరై

దొరికిన దారులవెంట కరిగి ప్రవహిస్తూ

విశ్వ వియత్తరంగిణి సముద్ర సంగమం

సాక్షాత్కరించే వేళ

నువ్వూ నేనూ మనమూ

అణు రూపాలమై అనంత అగ్నిగోళపు

ధూళి దూసరితమై విశ్రమిస్తేనేం

ఏమైతేనేం ఎవరికెవరం?

# ప్రశంసా పత్రం

"ఒంటరి సాయంత్రాలు" - రవి మంత్రిప్రగడ (Dublin, Ireland)

నీతో కలిసి చూసిన చాలా సాయంత్రాలు,
ఇప్పుడు కొత్తగా నాకు వీడ్కోలు పలుకుతున్నాయి.
భారమైన రాత్రుల్ని నా దగ్గర వదిలేసి వెనక్కి తిరిగి రానంటున్నాయి..
మూతపడని నా కను రెప్పలకి కిటికీ రెక్కలు వంత పడుతున్నాయి
నా ఎదురు చూపులు నల్లని రాత్రులతో స్నేహం మరిగి, నాకు కాటుక అవసరం లేకుండా చేస్తున్నాయి..
నువ్వెళ్లిన గుమ్మం అలానే నీ కోసం చూస్తోంది.
వర్షాన్ని చేతితో ఆపినట్టు నీ ఆలోచనల్ని ఆపి చూసాను,
చాలా ఆలస్యం అయినట్టుంది అప్పటికే తడిసి ముద్దైపోయాను.
ఒంటరితనం...
నువ్వు రాక ముందు కొన్ని సంవత్సరాలు ఇదే నా ప్రియమైన సహచరి.
సమూహంలో ఉన్నా నన్ను వదలక, అనుక్షణం వెన్నంటి ఉండే నా నీడ తను.
నువ్వు వచ్చిన కొత్తలో నన్ను వదిలి వెళ్లనని ఎంత మొండికేసిందనీ?
ఒప్పించి,బుజ్జగించి,తనతో నాకు ఇక అవసరం లేదని మెల్లగా బయటకి పంపేసాను.
నొచ్చుకుంది కాబోలు...పాపం!
నువ్వు పక్కన ఉన్నన్ని రోజులూ తన ధ్యాసే లేదంటే నమ్ముతావా?
బ్రతుకంతా రాత్రికిరాత్రి బాగుపడిపోయినట్టు ధీమా వచ్చేసింది.
ఇదిగో...మన మధ్య ఈ దూరం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది నాకు...
విరహం అనుకుందామా అంటే, నీ చుట్టూ ఉన్న నీ బంధాల అడ్డుగోడలు నన్ను చూసి కాదని వెకిలిగా నవ్వాయి.
ఎందుకో,ఈ నాలుగు గోడలూ మళ్ళీ నా పాత సహచరిని గుర్తుచేస్తున్నాయి.
తలచుకున్నదే తడవు,నేనెక్కడికి వెళ్తా అంటూ గుమ్మంచాటు నుండి తొంగి చూసింది.

ఎప్పటికైనా నా తోడు తనే అని మరొక్కసారి మందలించింది.

నేను తనకి బానిసనట.....వినడానికి కష్టంగా ఉన్నా ఇదే నిజం అని చెప్పింది.

నువ్వు పరిచయం చేసిన ఆశ మాత్రం నా మనసులో నుండి నాకు సందేశాలు పంపుతోంది.

ఈ ఒంటరితనాన్ని నాకు శాశ్వతంగా దూరం చేసే రోజు కోసం ఎదురుచూస్తోంది!!!

## "పువ్వు"

- సతీష్ గొల్లపూడి (Auckland, New Zealand)

పువ్వు రాక కోసమే తోటతో పాటు ఇన్నాళ్ళు నేను ఎదురు చూశాను

పువ్వు పాల పెదాలపై పదాలు ఏరుకున్నాను.

పువ్వు  అధరాలపై తియ్యని దరహాసం

మధువు మూలాలపై రాసిన మధుర కావ్యం.

వర్ణ సంపుటిని అపురూపంగా అల్లిన  పలచటి రేకులు

అంతరంగపు లోతుల్లోని స్వప్నాలకు తొడిగిన రెక్కలు.

పువ్వు పరిమళం శ్వాసలో కలిసిన ప్రతిసారి

వసంతం నాఆత్మను స్పర్శిస్తున్న అనుభూతి.

అనంత కాలంలో పువ్వుకి నాలుగు రోజులే రాసివుందా!

విశాలా ప్రపంచంలో పువ్వు నా హృదయంతోనే చెలిమిచేసిందా!

చిరు ప్రస్థానంలో దీర్ఘ సందేశాన్ని పొదువుకున్న అమలిన స్వచ్ఛత

అల్ప ఆయువులో అమిత ఆనందాన్ని వ్యక్తపరిచే వసివాడని

తాజాదనం.

పువ్వు వడలి పోయింది కానీ ఓడిపోలేదు

సృష్టికి భాష్యం చెప్పిన తాత్వికత

జీవితాన్ని అర్ధవంతం చేసుకున్న సార్థకత

తన గుర్తులుగా మిగిల్చి రాలిపోయింది.

శుభకృతు నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
27 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
మొట్టమొదటి కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

''భూమిని హత్తుకునే క్షణాలకోసం'' - అసిఫా గోపాల్ (Nellore, A.P. India)

యుద్ధం జరిగింది

యుద్ధం జరుగుతూనే ఉంది

యుద్ధాలు జరుగుతాయి

క్రషర్ లో చెరుకు నలిగినట్టు

టైరు కింద నిమ్మకాయ పగిలినట్టు

ప్రాణాలు విరిగిపోతున్నాయ్

చెట్లెప్పుడు

యుద్ధాలు ప్రకటించలేదు

ఏ జంతువులకు

అణ్వస్త్రాల ఆలోచన లేదు

అనంత ఆకాశం ప్రశాంతంగా ఉంటుంది

ఒక్క మనిషిలోనే

యుద్ధకాంక్ష

వణుకుతున్న హృదయాల తో

పసిబిడ్డలు

బరువెక్కిన గుండెలతో

ఊహతెలిసిన మనుషులు

పెనవేసుకున్న బంధాలు

బాంబుల ధూళి లో మసకబారుతున్నాయ్

ఆయుధం పట్టుకోవడం

మనిషితనం కాదు

ఎల్లలను దాటి

ఆక్రమణలు చేయడం మానవత్వం కాదు

ఇక్కడెవరూశాశ్వతం కాదు

ఏది ఎప్పటికి ఉండదు

నిను నువ్వే గెలవలేని వాడివి

ఎవర్ని ఓడిస్తావ్

పసిపాపల కంటిలో కాంతి చూడు

ఎగిరిపోతున్న పక్షుల పాట విను

హృదయాన్ని కడుక్కో

భూగోళం

నిన్ను హత్తుకుంటుంది

యుద్ధం లేని ప్రపంచం కావాలి

## "తను వెళ్ళిపోయింది"

- రాజ గడ్డం (Kavadi palli village, N, India)

ఆమె అలిగింది
అమ్మగారింటికి వెళ్లివస్తానని చెప్పింది
ఇంద్రధనస్సును రంగరించుకుంది
మేఘనాథుడికి సందేశమిచ్చింది
మౌనముతో మేఘుడు వెళ్ళొద్దని వాదిస్తున్నాడు.
ఆగ్రహించి ఉరుముతూ ఉరుకుతూ
ఆమెను గట్టిగా హత్తుకొని ఆపుతూ
నింగినిడిచి వెళ్ళొద్దని నిందిస్తున్నాడు.
ఆమె కన్నమట్టిని చూసింది
ఎండిన వృక్షాలను వీక్షించింది
మూగజీవాల ఆకలి కేకలు వింటోంది
ఎడారిని చూసింది
ఎండిన తటాకాలను జూసింది

కనికరించాలనుకుంది
కానీ మేఘనాధుడు వద్దంటున్నాడు
మాటలయుద్ధం మొదలయింది
పిడుగు అస్త్రం ప్రయోగించాడు మేఘుడు
ఆమెకు ఆవేశం పూనింది, కన్నెర్రజేసింది
కైపునుండి కన్నీరు విడిచింది
ఏడవొద్దని పంచభూతాలు ప్రాధేయపడ్డాయి
మేఘనాథుడు ముగ్దుడైపోయాడు
కన్నప్రేమను కాపాడుకోవాలనే ఆమె తపనకు కరిగిపోయాడు ఆమెను
అమ్మగారింటికి సాగనంపాడు
భానుడు వేదిస్తే భాష్పిభావనముద్వారా చెంతకు చేరమన్నాడు
ఆమె ఆనందముతో అరుస్తూ మురుస్తూ
పుడమితల్లి ఒడిలోకి పయనిస్తోంది
వెచ్చని సమీరాలు స్వాగతిస్తున్నాయ్
కమ్మటి మట్టివాసన గుబాళిస్తోంది
పూలమొగ్గ సొగసును అల్లుకుంటోంది
చిరుగాలులు చిందులేస్తున్నాయ్
చిరుజల్లులు కురుస్తున్నాయ్
ఆమె పర్వతాలపై పడిలేస్తూ పారుతోంది
తటాకాల తనువు నింపుకుంటూ సెలయేరు వయ్యారి వరదల వలపులతో
కన్నతల్లి కడుపులోకి చొచ్చి
ఆమె ఆకలిని తీర్చుకుంటూ
పుడమికి పచ్చని చీరను ప్రేమగా అల్లింది
సృష్టి సతత హరితమై సాగుతుంటే
కోయిలమ్మ కూతల పోటీలతో
కదలలేని వృక్షాలు సైతం కొమ్మలనూపుతూ కేరింతలేస్తూ

తుంటరి తుమ్మెదలు పూపొదపై వాలుతూ

కన్నెపిల్ల చెక్కిలిపై చిరుజల్లుల గిలిగింతలు

కొలనులోన కలువలు విరహిస్తూ వికసిస్తూ

చేపపిల్ల సిగ్గువీడి చిందులతో విందులిస్తూ

ఆమె, సుందమైన లోకాన్ని సృష్టించి మనకోసం .

ఆమె జగతికి జీవంపోసింది

ఆమె జీవరాశికి ఆకలితీర్చింది

నేలతల్లి కడుపు నింపింది

చివరికి

రవితాపము తాళలేక తల్లడిల్లుతూ

ఒంటరిగానే

వేడిమికి వెక్కి వెక్కి  ఏడుస్తూ

మీ అవసరానికి మళ్లీ వస్తానని అభయమిచ్చింది

ఆవిరైపోయింది

అత్తగారింటికి పయనమయింది

మేఘనాథుడి ఒడిలో కొలువైతీరింది

భువినుండి నింగికి,

తను వెళ్ళిపోయింది....! !

## ప్రశంసా పత్రం

"శిల-కల" - ఆవుల కార్తీక (Hyderabad, India)

అందమైన ఒక శిల

శిథిలమైపోవాలని

కల కంటోంది

జడివానలోనైనా జారి,

కరిగిపోవాలని

రవికీలలోనైనా రగిలి,

రాలిపోవాలని

గాలి నీరు సాయముతో సాగుతూ

సారమైన నేలగా నిలవాలని,

పుడమిపై పచ్చదనం పరిచి

పశుపక్షులను  పోషించాలని

రంగు రంగుల మట్టినై మురిపిస్తానని

శిల కలకంటోంది.

మిన్నును ముద్దాడుకుంటూ

కమ్మటి సువాసనతో

మేఘాలకు మత్తు నింపి

ప్రేమ చినుకులు కురిపించాలని,

ఆ చినుకులలో తడిసి తరలిపోవాలని

శిల కలకంటోంది.

ఆశకు

ఆశయానికి

అవసరం

ఓ అందమైన కల

ఆ కలను సాధించేలా

మేఘాలకు మత్తు నింపి

ప్రేమ చినుకులు కురిపించాలని,

ఆ చినుకులలో తడిసి తరలిపోవాలని

శిల కలకంటోంది.

ఆశకు

ఆశయానికి

అవసరం

ఓ అందమైన కల

ఆకలను సాధింఏలా

సాధనతో పోరాడటం కూడా ఓ కళ.

నిరుడు

నిర్జీవమైన శిలనని నిందించినా

నేడు

అందరూ సజీవ రాశులకు సంజీవిని,

శిలే అని కీర్తిస్తుంటే విని మురవాలని

శిల కలకంటోంది...!

COMMENTS